క్లుప్తంగా

పొన్నూరు మున్సిపల్ కమిషనర్‌గా నయూమ్ అహ్మద్



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మున్సిపల్ కమిషనర్‌గా నయూమ్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన రాధారెడ్డి బదిలీపై ఏలూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న నయూమ్ అహ్మద్ ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పురపాలక సంఘం సిబ్బంది, ఉద్యోగులు ఆయన్ను అభినందించారు.

ఆర్టీసీ డీఎంగా అజిత కుమారి బాధ్యతల స్వీకరణ



చేబ్రోలు: పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా తుమ్మపురి అజిత కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎంగా పనిచేసిన శ్రీనివాసరావు బాపట్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాపట్ల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న అజిత కుమారి పొన్నూరుకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో చీరాల, వినుకొండ, రావులపాలెం ఆర్టీసీ డిపోలలో పనిచేశారు. డీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అజిత కుమారి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, సిబ్బంది, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. ఆమెను యూనియన్ నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా చర్చి జూబ్లీ వేడుకలు



పెదనందిపాడు: మండల పరిధిలోని కాట్రపాడు పునీత శౌరీ చర్చిలో సోమవారం మధ్యాహ్నం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. గుంటూరు బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విచారణ గురువులు పూదోట తోమాస్ స్టోటస్, విజయవాడ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజు, పలువురు విచారణ గురువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

నగరంపాలెం: మంగళగిరి పట్టణ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూత ద్వారా లక్ష రూపాయిల చెక్కుని శ్రీనివాసరావు భార్యకు డీపీఓలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. గుంటూరు జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు ఆరోగ్యరాజు, ముఖ్య సభ్యులు, ఆర్ఐ రాజారావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వసంతోత్సవం, చక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, మూగబలి కార్యక్రమాల్ని నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు, చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్ర కుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. చైతన్య తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పెదకాకాని మండలం వెనిగండ్లలో ప్లాస్టిక్ నిర్మూలన, కాలుష్య నివారణ అనే అంశాలపై గ్రామ ప్రజలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్ వస్తువులు, గన్నీ సంచుల్ని వాడాలని సూచించారు. వాటిని తయారు చేసుకొనే విధానాన్ని స్థానిక మహిళలకు, విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడనాడాలని, దాని వల్ల భూమితో పాటు వాతావరణ కాలుష్యమవుతుందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌పై చర్చాగోష్టి నిర్వహించారు. అనంతరం మహిళలకు చేతి సంచుల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవాపథకం అధికారిణులు డాక్టర్ కె. ధనశ్రీ, డాక్టర్ జి. నిర్మల, డాక్టర్ వి. ప్రసూన, ఎం.శిరీష , గ్రామస్తులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం నగర శివారు చౌడవరంలోని కళాశాల సమీప గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని తెలిపారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ మేనేజర్ ఎం. నారాయణ మాట్లాడుతూ పర్యావరణ జీవన విధానం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎస్. శ్రీనివాసు, కోశాధికారి డాక్టర్ ఆర్. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని కాపాడండి

ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషిచేయాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగర శివారు లాం నందున్న కళాశాల వద్ద ప్రజలకు మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో 300 మొక్కల్ని నాటారు. గ్రామస్తులకు 300 కాటన్ సంచుల్ని పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.వి. రామారావు పాల్గొన్నారు.



వెనిగండ్ల అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులతో సామాజిక విజ్ఞాన కళాశాల అధ్యాపకులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఆర్‌వీఆర్‌జేసీలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ

పర్యావరణాన్ని కాపాడుకుని మానవ జీవితాల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల ర్యాలీని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ ప్రభావం మీదనే విశ్వంలో ప్రతి జీవి జీవన విధానం ఆధారపడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో, డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ జి. రామ్‌మోహన్‌బాబు, డాక్టర్ వి. రామకోటేశ్వరరావు, డాక్టర్ ఎస్. రాధిక పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

ఏఎన్‌యూ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అత్యధిక ప్రాధాన్యమివ్వాలని పెదకాకాని గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదకాకాని గ్రామంలోని చెరువు కట్టపై సోమవారం పంచాయతీ అధికారులతో కలసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కాలుష్యం నుంచి ప్రజలు రక్షింపబడతారని చెప్పారు. ఇంటి పెరట్లో కూడా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ. సాంబశివరావు స్థానిక నాయకులు గోళ్ల శ్యాం ముఖర్జీ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ నజీర్, సుంకర కృష్ణారెడ్డి, షేక్ ఆరిఫ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు

గుంటూరు రూరల్: పర్యావరణ హితం కోసం చెట్లు పెంచాలని, ప్రకృతి వనరులు కాపాడాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ పి.జయభారత్‌రావు సూచించారు. నగర శివారులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సోమవారం మిషన్ లైఫ్ ఫేజ్-1, వ్యక్తిగత లైఫ్- 75 కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయభారత్‌రావు మాట్లాడుతూ పర్యావరణ హిత జీవన శైలి అలవర్చుకోవాలని సూచించారు. అందరూ ఈ మిషన్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఏపీ కన్వెర్షన్ ఆఫ్ ఎనర్జీ మిషన్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీఎస్ఈసీఎం రాష్ట్రంలో పర్యావరణ జీవన శైలిపై ప్రభుత్వం సూచించిన కేటగిరిల్లో సమగ్రమైన 75 వ్యక్తిగత లైఫ్ కార్యకలాపాల జాబితా ఆవశ్యకతను వివరించారు. ఎస్ఈ ఎ.మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ పెద్దలు మనకందించిన ప్రకృతిని పర్యావరణ హిత జీవన శైలిలో భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. టౌన్-1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతతో కూడిన పర్యావరణ హిత జీవన శైలిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ హిత జీవన శైలి కరపత్రాలు విడుదల చేశారు. చెట్లు పెంచి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ పర్యావరణహిత జీవన శైలి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎనర్జి అసిస్టెంట్ జీఎం పరబ్రహ్మం మాట్లాడుతూ మన అవసరాల కోసం ప్రకృతి వనరుల్ని వృథా చేసి భావితరాలకు అన్యాయం చేయరాదని చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు హరిబాబు, మూర్తి, డీపీఈ వెంకటేశ్వరరావు, ఏఈలు, డీఈలు, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న చలపతి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు



మొక్కలు నాటుతున్న చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల యాజమాన్యం



పెదకాకానిలో చెరువు కట్టపై మొక్కలు నాటుతున్న పెదకాకాని గోళ్ల స్వరూపరాణి



పర్యావరణ పరిరక్షణ ర్యాలీని నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల యాజమాన్యం

వట్టిచెరుకూరులో జరిగిన ట్రాక్టర్ ప్రమాద దృశ్యాలు



సహాయక చర్యల్లో గ్రామస్తులు



ఘటన స్థలంలో గాయపడిన మహిళలు





చెల్లా చెదురుగా పడి ఉన్న మృతదేహాలు



108లో బాధితులకు అందిస్తున్న చికిత్స

చంద్రబాబు దొంగ హామీల్ని ప్రజలు నమ్మరు



చేబ్రోలులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పొన్నూరులో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు

చేబ్రోలు, పొన్నూరులో వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం

చేబ్రోలు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల పేర్లనే మార్చి చంద్రబాబు మేనిఫెస్టో-1 గా ప్రకటించారని చేబ్రోలు మండల వైఎస్సార్ సీపీ నాయకులు దుయ్యబట్టారు. బాబు దొంగ హామీల్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. చేబ్రోలులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మేనిఫెస్టో అంటేనే జగన్ అని, గత ఎన్నికల్లో ఆయన ప్రకటించిన హామీల్లో 98.5 శాతం అమలు చేసినట్లు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ చైర్మన్ చందు సాంబశివరావు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు 2019లో 600కు పైగా అబద్ధపు హామీలు ఇచ్చారని, ఆ మేనిఫెస్టో ఆన్‌లైన్‌లో కూడా లేకుండా చేశారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల్ని మభ్యపెట్టి, మోసగించేందుకు కుట్రలు, కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి వాటిని తూచా తప్పకుండా అమలు పరుస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాల్ని పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 34లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాల్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి. అప్పిరెడ్డి, పెద్ద మస్తాన్, పి. వెంకటేశ్వరరావు, జానీ, పోతురాజు, కె. మాణిక్యం, టి.శివయ్య పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో కనిపించని బాబు మేనిఫెస్టో

గత ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించిన 600కు పైగా ఇచ్చిన హామీల మేనిఫెస్టో ఆన్‌లైన్‌లో కూడా కనిపించదని, ప్రస్తుతం ఎన్నికల సమయం దగ్గరకు వస్తుండటంతో ప్రజల్ని మోసగించడానికి టీడీపీ దొంగ మేనిఫెస్టోలతో ప్రయత్నిస్తోందని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు తెలిపారు.

పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మామ ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ఆయన చనిపోయిన తర్వాత యుగ పురుషుడని కీర్తించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ బూటకపు మేనిఫెస్టోను ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి నారాయణరావు, కొల్లూరు శ్రీనివాసరావు, ఇందేటి వెంకట సుబ్బయ్య, వి.రంగారావు, నూర్ బాషా అల్లా బాషా పాల్గొన్నారు.

11న ఆచార్య హరిబాబుకు అవార్డు ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై విద్యా ప్రదాత సీహెచ్. సాంబయ్య వర్ధంతి పురస్కరించుకుని 11న ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి. హరిబాబుకు సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం చేస్తున్నట్లు ఆత్మీయ ఆర్ట్ థియేటర్ వ్యవస్థాపకులు సీహెచ్. భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభ అనంతరం 'ఎడారిలో వాన చినుకు' నాటిక ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఖాళీల్ని బ్లాక్ చేయరాదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఖాళీల్ని బ్లాక్ చేయరాదని డీఈవో పి.శైలజకు ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి. పెదబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం డీఈవో కార్యాలయంలో శైలజను కలసి వినతి పత్రం సమర్పించారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారు. సీనియారిటీ జాబితాల్లో అసంబద్ధతను తొలగించి, సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి ఉపాధ్యాయ బదిలీల్ని సమర్థంగా కొనసాగించాలని తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో అర్హులకు న్యాయం చేసి, అనర్హుల్ని తొలగించాలని పేర్కొన్నారు. బదిలీలు, ఉపాధ్యాయుల అభ్యంతరాల పరిష్కారానికి జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ కొనసాగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ నాయకులు సీహెచ్. నరసింహారావు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరండల్‌పేట పరిధి కొరిటిపాడు వినాయకనగర్‌లోని 16 నంబరు రేషన్ షాపు నుంచి 57 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో పక్కా సమాచారంతో పోలీసులు కొరిటిపాడు వద్ద ఆటోను నిలిపి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిరియాల వీరయ్య, ఆటో డ్రైవర్ అంజయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నగరంపాలెంలో....

నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట ప్రాంతంలో సోమవారం ఉదయం రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు తనిఖీల్లో భాగంగా ఆటోను పరిశీలించగా, సిరిపురం గ్రామానికి చెందిన యు. కొండలు 150 కిలోల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





ఎన్ఐఆర్ఎఫ్‌లో 'చలపతి'కి 89వ ర్యాంక్

గుంటూరు రూరల్: ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకుల్లో జాతీయ స్థాయిలో చలపతి ఫార్మసీ కళాశాలకు 89వ ర్యాంకు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రామారావు తెలిపారు. ప్రపంచ ర్యాంకింగ్‌లో మన విద్యా సంస్థలు స్థానం పొందాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ర్యాంకింగ్ వ్యవస్థను కళాశాలలకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో దేశవ్యాప్తంగా 435 కళాశాలలు పాల్గొన్నాయని వివరించారు. తమ కళాశాలను 2004లో ప్రారంభించగా, ఇప్పటికే ఏఎన్‌యూ అనుబంధ కళాశాలగా అనుమతి పొందిందన్నారు. కృష్ణ విశ్వవిద్యాలయం పరిశోధన కళాశాలగా, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌గా, 12బీ, ఐఎస్ఎట, నాక్ ఏ ప్లస్ గ్రేడ్, ఎన్‌బీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర గుర్తింపులు పొందినట్లు పేర్కొన్నారు. ర్యాంకు కోసం కృషి చేసిన అధ్యాపకుల్ని చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు అభినందించారు.



ర్యాంకును చూపుతున్న ప్రిన్సిపాల్ రామారావు, చలపతి విద్యాసంస్థల చైర్మన్ ఆంజనేయులు

వైభవంగా శ్రీవారి రథోత్సవం

పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ధ్యానం, నవగ్రహారాధన, నిత్య హోమం తదితర కార్యక్రమాలు బృందావనం ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. సాయంత్రం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా పుర వీధుల్లో సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీ రాంప్రసాద్ పాల్గొని రథోత్సవం ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు పావులూరి కిశోర్, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు.